సాక్షి
వికారాబాద్

శనివారం : 29 : జూలై : 2023



బడులకు నిర్వహణ నిధులు

ప్రభుత్వ బడుల నిర్వహణకు మొదటి విడత నిధులు విడుదలయ్యాయి. జూన్ 12 నుంచి విద్యార్థులు బడిబాట పట్టారు. 8లో▸



పచ్చిరొట్ట.. దిగుబడికి దిట్ట

పచ్చిరొట్ట ఎరువులు భూసారాన్ని పెంచి అధిక దిగుబడికి దోహదపడుతుందని వ్యవసాయ అధికారులు తెలిపారు. 8లో▸



పశువులు పైలం

వర్షాల నేపథ్యంలో జీవాలకు సీజనల్ వ్యాధులు సోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్య అధికారులు తెలిపారు. 9లో▸

అధిక వర్షపాతం.. అన్నదాతకు శాపం!

- జిల్లావ్యాప్తంగా 258.1 మిల్లీమీటర్ల అధిక వర్షపాతం నమోదు
- 10,500 ఎకరాల్లో నీటమునిగిన పంటలు
- 214 ఇళ్లు పాక్షికంగా దెబ్బతినట్లు గుర్తింపు
- పూర్తిస్థాయి నీటిమట్టంతో ప్రాజెక్టులకు జలకళ



పంటపొలాల్లోకి చేరిన వర్షపు నీటిని పరిశీలిస్తున్న అధికారులు

వికారాబాద్ అర్బన్: సీజన్ ప్రారంభంలో వర్షాలు కాస్త వెనుకబడినట్లు అనిపించినా.. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలతో జిల్లాలోని రైతులు, ప్రజలకు లాభం కన్నా నష్టమే మిగిలిందని చెప్పాలి. వారం రోజులుగా జిల్లావ్యాప్తంగా వర్షాలు దంచి కొడుతున్నాయి. ఐదురోజుల పాటు ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షాలకు చెరువులు, కుంటలు నిండి అలుగు పారుతున్నాయి. అధిక వర్షపాతంతో జిల్లాలోని పలు మండలాల్లో పంటపొలాలు నీటమునిగాయి. దీంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. జూలై మొదటి వారంలో జిల్లాలోని కొన్ని మండలాల్లో వర్షం కురిసినప్పటికీ ఆ తర్వాత మరోవారం పాటు మొఖం చాటేశాయి. అనంతరం జూలై 20వ తేదీ నుంచి ప్రారంభమైన వర్షాలు విరామం లేకుండా కురుస్తున్నాయి. ఈనెల 25, 26, 27 తేదీల్లో జిల్లాలోని అన్ని మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది. దీంతో చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి.

సాధారణం కన్నా ఎక్కువ వర్షపాతం...

జిల్లావ్యాప్తంగా జూన్, జూలై నెలలో 271.4 మి.మీటర్ల సాధారణ వర్షపాతం నమోదు కావాలి. అయితే వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో శుక్రవారం వరకు జిల్లాలో 529.5 మిల్లీ మీటర్ల సాధారణ వర్షపాతం నమోదైంది. అంటే ఇప్పటికే 258.1 మి.మీ అధిక వర్షపాతం నమోదైంది. జిల్లా మొత్తంలో సంవత్సరానికి 799.8 సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. ఇప్పటికే 529.5 వర్షపాతం నమోదైంది. వానాకాలం ఇంకా పూర్తికాని నేపథ్యంలో మరింత వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉండటంతో సాధారణం కంటే ఎక్కువ కురిసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

ప్రాజెక్టులకు జలకళ..

వరుస వర్షాలతో జిల్లాలోని కోట్‌పల్లి, సర్పన్ పల్లి, లక్నాపూర్, జుంటుపల్లి ప్రాజెక్టులకు జలకళ వచ్చింది. ప్రాజెక్టులు నిండుకుండల్లా దర్శనమివ్వడంతో పర్యాటకులు పోటెత్తుతున్నారు. ఓవైపు చెరువులు, కుంటలు నిండుతున్నందుకు సంతోషంగా ఉన్నప్పటికీ మరోవైపు పంటలు నీటమునగడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. జిల్లాలోని కోట్‌పల్లి ప్రాజెక్టు 24 అడుగుల సామర్థ్యం ఉండగా గురువారం రంనాటికి ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరింది. అదేవిధంగా సర్పన్‌పల్లి ప్రాజెక్టు సామర్థ్యం 18 అడుగులు కాగా బుధవారం సాయంత్రానికే పూర్తిగా నిండి అలుగు పారింది. లక్నాపూర్ ప్రాజెక్టు పూ ర్తి సామర్థ్యం 23 అడుగులు కాగా పూర్తిస్థాయిలో నిండి అలుగు పారుతోంది. ఇలా జిల్లాలోని అన్ని చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి.

నీటమునిగిన పంటలు..

ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలతో ఓ వైపు ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నప్పటికీ రైతులకు మాత్రం తీరని నష్టం తెచ్చిపెట్టాయి. వ్యవసాయ అధికారుల అంచనా ప్రకారం జిల్లాలో 10,500 ఎకరాల్లో పంట నీటిమునిగింది. దీంతో జిల్లాలోని దాదాపు 5,700 మంది రైతులు నష్టపోయినట్లు గుర్తించారు. ప్రస్తుతం పొలాల్లోకి చేరిన వర్షపు నీరు పూర్తిగా బయటకు పోతేగాని ఎంతమేర నష్టం జరిగిందో అంచనా వేయలేమని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో ప్రధానంగా పత్తి, వరి, మొక్కజొన్న, కందిపంట పొలాల్లో వర్షపు నీరు అధికంగా చేరినట్లు అధికారులు గుర్తించారు. తాండూరు డివిజన్‌లో అధికంగా పంటనష్టం జరిగినట్లు సమాచారం. అదేవిధంగా వర్షాలకు నాలుగు రోజుల్లోనే 214 గృహాలు పాక్షికంగా దెబ్బతినట్లు అధికారులు గుర్తించారు.

నష్టాన్ని తగ్గించుకోవాలి



ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో పంటలకు నష్టం జరగకుండా ఉండాలంటే పొలాల్లో నిలిచిన వర్షపు నీటిని బయటకు పంపించాలి. ప్రస్తుతం ఉన్న పరిస్థితిలో నీరు భూమిలోకి ఇంకే అవకాశం లేదు. అయితే శుక్రవారం నుంచి వర్షం కొంత విరామం ఇవ్వడం రైతులకు మంచి పరిణామం. తగిన జాగ్రత్తలు తీసుకుంటే పంట నష్టాన్ని కొంతమేర తగ్గించవచ్చు. వానలు పూర్తిగా ఆగిన తర్వాత పంటకు తెగుళ్లు రాకుండా మందులు వాడాలి.

– గోపాల్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

న్యూస్‌రీల్

గెలుపే లక్ష్యంగా పనిచేయండి
మంత్రి హరీశ్‌రావు



హరీశ్‌రావుకు మొక్క అందజేస్తున్న నాయకులు, చిత్రంలో ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

కొడంగల్: బీఆర్‌ఎస్ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని మంత్రి హరీశ్‌రావు అన్నారు. కొడంగల్ నియోజకవర్గానికి చెందిన పలువురు శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు వెళ్లారు. మంత్రి హరీశ్‌రావ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి హరీశ్‌రావ్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్‌లో చేరిన వారిలో సురేష్, రాఘవేందర్‌రెడ్డి, బాలు, నిసార్, వంశీ, శ్రీనివాస్ ఉన్నారు. కార్యక్రమంలో నారాయణపేట గ్రంథాలయ సంస్థ చైర్మన్ రామకృష్ణ, రాజేశ్ పాల్గొన్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్‌కు దరఖాస్తుల ఆహ్వానం

యాలాల: ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి సుధాకర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బడి మధ్యలో ఆపేసిన వారు నేరుగా ఓపెన్ టెన్త్‌లో అడ్మిషన్ పొందవచ్చన్నారు. టెన్త్ పాసయ్యాక వివిధ కారణాలతో ఇంటర్‌లో చేరనివారు ఓపెన్ ఇంటర్‌లో చేరేందుకు అవకాశం ఉందన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు ఆగస్టు 10వ తేదీ తుదిగడువని ఎంఈఓ తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ నం .83283 79942లో సంప్రదించాలన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు

వికారాబాద్ అర్బన్: ఉపాధ్యాయ దినోత్సవం (సెప్టెంబర్ 5) సందర్భంగా 2023 సంవత్సరానికి సంబంధించి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి రేణుకాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, మండల పరిషత్, జిల్లా పరిషత్, ఎయిడెడ్, రెసిడెన్షియల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సంబంధిత మండల విద్యాధికారులు ఆగస్టు 30వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు ఆయా మండలాల ప్రతిపాదనలు కార్యాలయానికి పంపించాలని సూచించారు. దరఖాస్తుదారులు ఒరిజినల్ పత్రాలతో పాటు ఒక సెట్ జిరాక్స్ కాపీ జతచేయాలని డీఈఓ తెలిపారు.

ఇకనుంచి ప్రతిరోజు 'డయల్ యువర్ డీఎం'

పరిగి: ఇకనుంచి ఆర్టీసీ సేవలకు సంబంధించి సమస్యలు, సలహాలు అందించేందుకు ప్రతిరోజు 'డయల్ యువర్ డీఎం' ప్రోగ్రాం నిర్వహించనున్నట్లు పరిగి ఆర్టీసీ డీఎం పవిత్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం నుంచి ఈ కార్యక్రమం ప్రారంభం అవుతుందని తెలిపారు. ఆర్టీసీ సేవలపై ఎలాంటి సమస్యలున్నా ప్రతిరోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు గంట పాటు 99592 25253 నంబర్‌కు ఫోన్‌చేసి నేరుగా డీఎం దృష్టికి తీసుకెళ్లొచ్చన్నారు.

ప్రధానమంత్రి పురస్కారాలకు దరఖాస్తు చేసుకోండి

వికారాబాద్ అర్బన్: విద్యార్థులు వివిధ రంగాల్లో చేసిన విశేషమైన కృషిని గుర్తించి వారికి ఇచ్చే ప్రధానమంత్రి జాతీయ బాలల పురస్కార్ అవార్డు-2023కి సంబంధించి జిల్లా నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా మహిళా శిశుసంక్షేమ శాఖ అధికారిని కేతావత్ లలిత కుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక సేవ, సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణం, ఆర్ట్స్ అండ్ కల్చర్, ఆవిష్కరణలు వంటి 6 రంగాల్లో విశేష కృషి, ప్రతిభ కనబరిచిన విద్యార్థిని, విద్యార్థులు ఈ అవార్డులకు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు. www.awardr.gov.in వెబ్‌సైట్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 6 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాలలోపు వయస్సు వారు అర్హులని అన్నారు. ఆగస్టు 31వ తేదీ లోపు దరఖాస్తులు సమర్పించవచ్చన్నారు.

తహసీల్దార్ షర్మిలకు జేసీగా పదోన్నతి

బొంరాస్‌పేట: బొంరాస్‌పేట తహసీల్దార్ షర్మిలకు పదోన్నతి లభించింది. గతేడాది నవంబరు 2న బొంరాస్‌పేట తహసీల్దారుగా బదిలీపై వచ్చిన ఆమెకి తాజాగా అనుభవరీత్యా ప్రభుత్వం జాయింట్ కలెక్టర్‌గా పదోన్నతి కల్పించింది. హైదరాబాద్‌లోని ఏదేని శాఖలో ఆమెకు పోస్టింగ్ ఇవ్వనున్నట్ల సమాచారం. మరో రెండు రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా తహసీల్దార్ల బదిలీలు, పదోన్నతులు చేపట్టి జీఓ జారీ చేయనుంది.

అతిథులకు పచ్చజెండా



ప్రభుత్వ కళాశాలలో బోధిస్తున్న అతిథి అధ్యాపకుడు

- ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 40మంది గెస్ట్ లెక్చరర్ల కొనసాగింపునకు నిర్ణయం
- మిగితా 11 ఖాళీలకు దరఖాస్తులు స్వీకరిస్తామన్న డీఐఈఓ

వికారాబాద్ అర్బన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అతిథి అధ్యాపకులుగా పనిచేస్తున్న వారికి ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. గతేడాది, అంతకు ముందు జూనియర్ కళాశాలల్లో గెస్ట్ లెక్చరర్లుగా చేరిన వారిని ఈ ఏడాది కూడా కొనసాగించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే ఇప్పటికే పనిచేస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీపై ప్రభుత్వం ఎటూ తేల్చకుండానే కొత్తవారిని నియమించుకునేందుకు నోటిఫికేషన్ ఇచ్చిన విషయం తెలిసిందే. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఇప్పటికే పనిచేస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీ సభ్యులు కోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో పాతవారినే కొనసాగించడంతో పాటు పోస్టులు ఖాళీగా ఉన్నచోట కొత్తవారిని నియమించుకునేలా జూనియర్ ఇంటర్మీడియెట్ శాఖ రెండు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేసింది.

సరిపడా అధ్యాపకులు లేక..

ప్రైవేటు కాలేజీల్లో అధిక ఫీజులు కట్టలేని విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేరుతున్నారు. అయితే కళాశాలల్లో విద్యార్థులకు సరిపడా లెక్చరర్లు లేకపోవడంతో కొన్నేళ్లుగా గెస్ట్ ఫ్యాకల్టీని నియమిస్తూ బోధన కొనసాగిస్తున్నారు. ఇలా వీరి (రెన్యూవల్) విషయం తేల్చకుండానే కొత్త నియామకాలు చేపడుతున్నట్లు నోటిఫికేషన్ ఇవ్వడంతో వారంతా ఆందోళనకు గురయ్యారు. తమను రెన్యూవల్ చేయాలని కోర్టుకు వెళ్లడంతో ప్రభుత్వం వారినే కొనసాగించడానికి నిర్ణయించింది.

ఏటా రెండువేల విద్యార్థులకు పైగా..

జిల్లాలో 9 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా ఏటా సుమారు రెండువేల మందికి పైగా విద్యార్థులు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్లు తీసుకుంటున్నారు. అయితే ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు సరిపడా ఫ్యాకల్టీ లేకపోవడంతో ప్రభుత్వం గెస్ట్ ఫ్యాకల్టీని నియమిస్తూ బోధన సాగిస్తూ వస్తోంది. ప్రస్తుతానికి జిల్లాలోని ఆయా కళాశాలల్లో 40 మంది గెస్ట్ ఫ్యాకల్టీ పనిచేస్తున్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో వారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ 40 మంది కాకుండా ఖాళీగా ఉన్న మరో 11 పోస్టుల కోసం డీఐఈఓ దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఆయా పోస్టులకు నిరుద్యోగుల నుంచి పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. వీలైనంత త్వరగా ఆయా పోస్టులను కూడా భర్తీ చేస్తామని స్పష్టం చేశారు.

నిరుద్యోగ మహిళలకు స్వయం ఉపాధి శిక్షణ

మొయినాబాద్: నిరుద్యోగ మహిళలకు స్వయం ఉపాధి రంగాల్లో ఉచిత శిక్షణఇవ్వనున్నట్లు ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ(ఆర్‌సెటీ) డైరెక్టర్ రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల పరిధిలోని చిలుకూరు మహిళా ప్రాంగణం ఆవరణలో ఉన్న ఎస్‌బీఐ ఆర్‌సెటీ కేంద్రంలో మహిళలకు మగ్గం వర్క్స్, బ్యూటీపార్లర్ కోర్సుల్లో ఈ నెల 31 నుంచి నెల రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. 19 నుంచి 45 సంవత్సరాల వయసు ఉండి పదో తరగతి చదివిన మహిళలుఈ నెల 31లోగా చిలుకూరులోని ఎస్‌బీఐ ఆర్‌సెటీ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు ఫారానికి ఎస్ఎస్‌సీ మెమో, రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్ కాపీలు, నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు జతచేయాలన్నారు. మరిన్ని వివరాలకు 8639079122, 7981951167, 9000778300 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కరెంటు కాటుకు కర్షకుడు బలి

- గట్టిగానితండాలో ఘటన



శంకర్‌నాయక్ (ఫైల్)

బొంరాస్‌పేట: మండల పరిధిలోని గట్టిగానితండాలో విద్యుత్‌షాక్‌కు గురై రైతు మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. తండాకు చెందిన కెతావత్ శంకర్‌నాయక్(59) రోజూ మాదిరిగానే శుక్రవారం ఉదయం పొలం పనులకు వెళ్లాడు. ఈ సమయంలో తేలి ఉన్న బోరు మోటారు తీగపై అడుగు వేయడంతో విద్యుదాఘాతనికి గురయ్యాడు. పక్క పొలాల రైతులు వచ్చి చూడగా అప్పటికే మృతిచెందాడు. రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.



ఓటరు జాబితాపై సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

పకడ్బందీగా తుది ఓటర్ జాబితా

రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులతో కలెక్టర్ సమీక్ష

వికారాబాద్ అర్బన్: ఓటర్ జాబితాను పకడ్బందీగా తయారుచేసేందుకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లో.. జిల్లా అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ, లింగానాయక్, వికారాబాద్ తాండూర్ ఆర్డీఓలు విజయకుమారి, శ్రీనివాసరావు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ జాబితా రూపకల్పనపై కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఓటరు జాబితా రూపొందించేందుకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు అధికారులకు సహకరించాలని కోరారు. అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు పూర్తయిన వారు ఓటరుగా నమోదు చేసుకునేందుకు సెప్టెంబర్ 19 వరకు అవకాశం కల్పించడం జరిగిందన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద బూత్‌ల వద్ద అధికారులు అందుబాటులో ఉంటారని ఓటర్‌గా నమోదుకు ఇదే చివరి అవకాశం అని కలెక్టర్ తెలిపారు. సమ్మర్ రివిజన్లో భాగంగా ఆగస్టు 21న డ్రాఫ్ట్ రోల్ పబ్లికేషన్ ఉంటుందని.. అక్టోబర్ 4న తుది ఓటర్ జాబితాను విడుదల చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటివరకు జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో 21వేల మంది కొత్త ఓటర్లను నమోదు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో 28 పోలింగ్ కేంద్రాల్లో లోకేషన్ మార్పు, 134 పోలింగ్ కేంద్రాల పేర్ల మార్పుపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ అభిప్రాయాలను సోమవారం సాయంత్రం వరకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల డీటీ రవీందర్ దత్తు, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్, వైఎస్సార్‌టీపీ, బీఎస్పీ, సీపీఎం, సమాజ్ వాదీ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులు లేకుండా చూడాలి

డీఎస్పీ నర్సింహులు

బంట్వారం: పీఎస్‌లలో పెండింగ్ కేసులు లేకుండా చూడాలని డీఎస్పీ నర్సింహులు సూచించారు. శుక్రవారం ఆయన బంట్వారం, కోట్‌పల్లి పోలీస్ స్టేషన్లను సందర్శించి సిబ్బందికి సూచనలు చేశారు. సమాజంలో పోలీసుల పాత్ర కీలకమన్నారు. ఒకవైపు నేరాలను అరికడుతూనే మరోవైపు శాంతిభద్రతలను కాపాడాలన్నారు. రోడ్డు ప్రమాదాలు, డ్రంక్ అండ్ డ్రైవ్, సైబర్ మోసాలు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో రాత్రివేళ గస్తీని ముమ్మరం చేయాలన్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారిపై ఉక్కుపాదం మోపుతామన్నారు.



డీఎస్పీకి మొక్క అందజేస్తున్న సీఐ రామకృష్ణ

నేరాల నియంత్రణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ధారూరు సీఐ రామకృష్ణ, ఎస్ఐలు సత్యనారాయణరాజు, ఆనంద్ కుమార్, ఏఎస్ఐ అంజాద్, సిబ్బంది పాల్గొన్నారు.


జాగ్రత్తలతో పంటలను కాపాడుకోండి


జిల్లా వ్యవసాయ అధికారి గీతారెడ్డి

నందిగామ: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పంట పొలాల్లో వర్షపు నీరు నిల్వకాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి రైతులకు సూచించారు. మండల పరిధిలోని మామిడిపల్లిలో మండల వ్యవసాయాధికారి గోపాల్‌తో కలిసి శుక్రవారం ఆమె పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గీతారెడ్డి మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పత్తి, మొక్కజొన్న, కంది, కూరగాయల రైతులు తమ పంటలను కాపాడుకోవడానికి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎరువులను ఎట్టిపరిస్థితుల్లో వాడొద్దని, వర్షాలు తగ్గిన తర్వాత కంది, మొక్కజొన్న, పత్తి, కూరగాయల మొక్కలకు యూరియా, పొటాష్ ఎరువులను వాడుకోవాలని సూచించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో పత్తికి రసం పీల్చే పురుగుల బెడద ఉంటుందని, వాటి నివారణకు డయాఫిన్‌ట్యూరన్‌తో పాటు అసిట మఫ్రిడ్3.9 డబ్ల్యూపీ 20 లీటర్ల నీటికి 25 గ్రాములు వేసి పంటలపై పిచికారీ చేయాలన్నారు. వరి నారుమళ్ల దశలో ఉన్నాయని, వరి నారు వేసే ముందు నారు కొనలు తెంచి వేయాలని, అనంతరం నాటాలని వివరించారు. పంటలను సందర్శించిన వారిలో ఏఈఓ రవి ఉన్నారు.


నేతల చూపు.. బీజేపీ వైపు

- అధికార పార్టీని వీడనున్న డీసీసీబీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి
- అదేబాటలో తాండూరు మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్?
- బీజేపీ ముఖ్య నేతలతో నేడు అపాయింట్‌మెంట్ ఫిక్స్





లక్ష్మారెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్



విజయలక్ష్మి, తాండూర్ మాజీ చైర్‌పర్సన్

తాండూరు: బీజేపీలోకి వలసలు పర్వం మొదలైంది. తాండూరు నియోజకవర్గంలో ఇప్పటికే పలువురు బడా నేతలు బీజేపీలో చేరగా అదే బాటలో మరికొందరు కాషాయ కండువా కప్పుకొనేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి మధ్య ఉన్న వర్గపోరు మధ్య నలిగిపోతున్నామనే భావనలో ఉన్న ఆ పార్టీకి చెందిన డీసీసీబీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, తాండూరు మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కోట్రిక విజయలక్ష్మి పార్టీని వీడి బీజేపీలో చేరుతున్నట్లు ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ క్రమంలో వారు శనివారం బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్ చుగ్‌తో పాటు ఆ పార్టీకి చెందిన ముఖ్య నేతల అపాయింట్‌మెంట్ తీసుకున్నట్లు సమాచారం.

సర్పంచ్ నుంచి డీసీసీబీ చైర్మన్‌గా..

పెద్దేముల్ మండలానికి చెందిన లక్ష్మారెడ్డి.. సర్పంచ్ స్థాయి నుంచి తాండూరు మున్సిపల్ చైర్మన్, డీసీసీబీ మాజీ చైర్మన్‌గా అంచెలంచెలుగా ఎదిగారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ టికెట్ ఆశించినప్పటికీ ఆ పార్టీలో ఉన్న వర్గపోరుతో టికెట్ దక్కలేదు. దీంతో ఎన్నికల సమయంలో మౌనంగా ఉండిపోయారు. మంత్రి సబితారెడ్డి ముఖ్య అనుచరుడిగా కొనసాగుతున్న లక్ష్మారెడ్డి అప్పటి పరిస్థితులను బట్టి సబితారెడ్డి పిలుపు మేరకు నాలుగేళ్ల క్రితం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. తదనంతరం జరిగిన జెడ్పీటీసీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ తరఫున లక్ష్మారెడ్డి తనయుడు మహిపాల్‌రెడ్డి పెద్దేముల్ మండల జెడ్పీటీసీ అభ్యర్థిగా బరిలో నిలబడి ఓటమిపాలయ్యారు. తన కొడుకు ఓటమికి సొంత పార్టీకి చెందిన నాయకులే కారణమంటూ.. ఎన్నికల్లో వారు సహకరించలేదంటూ లక్ష్మారెడ్డి గతంలో బహిరంగంగానే ఆరోపించారు. నాలుగేళ్లుగా బీఆర్‌ఎస్ పార్టీలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి వర్గంలో కొనసాగుతూ వచ్చారు. అయితే ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి వల్ల పార్టీలో గుర్తింపు రావడం లేదనే భావనలో ఉన్నారు. లక్ష్మారెడ్డి రెండు రోజుల క్రితం మంత్రి సబితారెడ్డిని కలిసి బీఆర్‌ఎస్ పార్టీని వీడి బీజేపీలో చేరుతానని చెప్పారు. మంత్రి నచ్చజెప్పే ప్రయత్నం చేసినప్పటికీ సమేమిరా అన్నట్లు సమాచారం. అదేరోజు కమలం పార్టీ రాష్ట్ర నేతలను కలిశారు. ఈ నేపథ్యంలో బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్‌చుగ్, రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డితో పాటు మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని కలిసేందుకు శనివారం అపాయింట్‌మెంట్ ఫిక్స్ అయ్యిందని లక్ష్మారెడ్డి తెలిపారు. ఆగస్టు నెలలో తాండూరు నియోజకవర్గంతో పాటు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని వివిధ పార్టీలకు చెందిన ప్రముఖ నాయకులతో కలిసి బీజేపీలో చేరుతానని స్పష్టం చేశారు.

మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సైతం..!

తాండూరు మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కోట్రికె విజయలక్ష్మి కూడా బీఆర్‌ఎస్ పార్టీని వీడి బీజేపీలో చేరుతారని జోరుగా ప్రచారం జరుగుతోంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం తాండూరు మున్సిపాలిటీకి తొలి చైర్‌పర్సన్‌గా పనిచేశారు. రెండున్నరేళ్ల పాటు చైర్‌పర్సన్‌గా కొనసాగిన తర్వాత ఒప్పందంలో భాగంగా పదవికి రాజీనామా చేశారు. నాటి నుంచి బీఆర్‌ఎస్ పార్టీలో పట్నం మహేందర్‌రెడ్డి వెంట నడుస్తున్నారు. అయితే గత కొన్నేళ్లుగా విజయలక్ష్మి పార్టీ మారుతున్నారని ప్రచారం జరుగుతోంది. ఈ విషయమై ఆమెను సంప్రదించగా తాను పార్టీ మారుతున్నానని వస్తున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. తాను బీఆర్‌ఎస్ పార్టీలోనే కొనసాగుతానని.. అందులో ఎలాంటి మార్పులేదని ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డితోనే పనిచేస్తానని విజయలక్ష్మి స్పష్టం చేశారు.

క్లుప్తంగా

చోరీ కేసులో ఇద్దరు నిందితులకు రిమాండ్

యాలాల: మోటార్ల దొంగతనం కేసులో ఇద్దరు నిందితులను శుక్రవారం పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ అరవింద్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని బషీర్ మియాతండా సమీపంలోని నరేందర్ పర్థానీ పాలిషింగ్ యూనిట్‌లో ఈ నెల 22న రూ.60వేల విలువైన 10 మోటార్లు చోరీకి గురయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా శుక్రవారం వాహనాల తనిఖీల్లో భాగంగా చోరీకి పాల్పడ్డ మహ్మద్ ఖుద్దుద్దీన్, మహ్మద్ ఉమేర్‌లు ఆటోలో మోటార్లను తరలిస్తున్నట్లు గుర్తించి అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సేవలను వినియోగించుకోవాలి

ఏపీజీవీబీ మహబూబ్‌నగర్ రీజినల్ మేనేజర్ జి.సుభాశ్



మాట్లాడుతున్న సుభాశ్

బొంరాస్‌పేట: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు(ఏపీజీవీబీ) అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని మహబూబ్‌నగర్ రీజినల్ మేనేజర్ జి.సుభాశ్ అన్నారు. శుక్రవారం దుద్యాల మండల పరిధిలోని ఏపీజీవీబీ హకీంపేట బ్రాంచ్ కార్యాలయాన్ని నూతన భవనంలోకి మార్చారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బ్యాంకులో కొత్త ఖాతాలు తెరవడం, గోల్డ్ లోన్, స్వయం సహాయక సంఘాల రుణాలు, సంఘాల రుణాల రెన్యూవల్ ప్రాముఖ్యత, జీవిత బీమా తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో బ్యాంకు అధికారులు రవికిశోర్‌రెడ్డి, మేరి, రవికాంత్, పీపీ హరీశ్‌కుమార్, ఎల్.రాంబాబు, గజేంద్ర పాల్గొన్నారు.

జేఏసీ మాజీ చైర్మన్ చెల్మారెడ్డి మృతి



చెల్మారెడ్డి మృతదేహానికి నివాళి అర్పిస్తున్న మంత్రి సబితారెడ్డి

తుర్కయంజాల్: తెలంగాణ మలి దశ ఉద్యమకారుడు, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జేఏసీ మాజీ చైర్మన్ వెదిరె చెల్మారెడ్డి అనారోగ్యంతో శుక్రవారం తుదిశ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న మంత్రి సబితారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ప్రొఫెసర్ కోదండరామ్, రైతు బంధు జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, తదితరులు ఆయన మృత దేహానికి నివాళి అర్పించారు.

వారెవ్వా.. 'సామాజిక' బాధ్యత

- ఇంటినుంచి వెళ్లిన బాలురను పట్టించిన సోషల్ మీడియా

యాచారం: ఇంటి నుంచి వెళ్లిపోయిన అన్నదమ్ములు సోషల్ మీడియా చొరవతో తల్లిదండ్రుల వద్దకు చేరారు. సీఐ సైదయ్య తెలిపిన ప్రకారం.. నల్గొండ జిల్లా చింతపల్లి మండల ఉప్పరిపల్లి గ్రామానికి చెందిన శ్రీను, రేణుక దంపతులకు ఇద్దరు కొడుకులు సంతానం(మైనర్లు). తల్లిదండ్రులు మాల్ మార్కెట్‌లో నివాసం ఉంటూ పదేళ్లుగా ఫాస్ట్ ఫుడ్ సెంటర్ నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉండగా శుక్రవారం ఉదయం 3.30 గంటల ప్రాంతంలో అన్నదమ్ములిద్దరూ నిద్రలేచి ఇంటి నుంచి వెళ్లిపోయారు. ఉదయం 5గంటలకు తండ్రి లేచిచూడగా కుమారులు కనిపించలేదు. కాసేపు చుట్టుపక్కల వెతికినా జాడ కనిపించకపోవడంతో యాచారం పోలీసులకు సమాచారం ఇచ్చారు. మాల్ మార్కెట్లోని సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ విషయం రోజంతా సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. ఈ క్రమంలో మెదక్ బస్టాండ్‌లో వీరిని గుర్తించిన స్థానిక పోలీసులు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. మెదక్ పోలీసుల సంరక్షణలో ఉన్న తమ కుమారులను తెచ్చుకునేందుకు తల్లిదండ్రులు అక్కడకు బయలుదేరారు.

బడులకు నిర్వహణ నిధులు

పాఠశాలల నిర్వహణకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. పాఠశాలలు ప్రారంభించి నెల రోజులు గడుస్తున్నా నిధులు లేక ప్రధానోపాధ్యాయులు ఇబ్బంది పడ్డారు. మొదటి విడతలో భాగంగా 50శాతం నిధులు విడుదలయ్యాయి.

విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- తొలివిడతలో 50శాతం
- స్పోర్ట్స్ గ్రాంట్‌లు సైతం మంజూరు



పరిగి ప్రభుత్వ ఉన్నత పాఠశాల

పరిగి: ప్రభుత్వ పాఠశాలల నిర్వహణకు ప్రభుత్వం మొదటి విడత నిధులు విడుదల చేసింది. ఈ ఏడాది జూన్ 12 నుంచి పాఠశాలలు ప్రారంభం కావడంతో విద్యార్థులు బడిబాట పట్టారు. కానీ ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రం సుద్దముక్క కొనుగోలుకు కూడా పైసలు లేకపోవడంతో ఇబ్బందికరంగా మారింది. ప్రతీ విద్యాసంవత్సరం ప్రారంభంలో ప్రభుత్వ పాఠశాలలను నిధుల కొరత వేధిస్తోంది. దశాబ్ది ఉత్సవాల సందర్భంగానైనా నిధులు సకాలంలో విడుదలవుతాయని ఆశించినా ఫలితం లేకుండా పోయింది. మరో వైపు అన్ని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కరపత్రాలు, ఫ్లెక్సీలకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సొంత ఖర్చుతో పనులను నిర్వహించారు. ఎట్టకేలకు ఈ విద్యాసంవత్సరం 2023–24లో పాఠశాల శుభ్రత, ఇతర నిర్వహణకు ప్రభుత్వం మొదటి విడత నిధులను విడుదల చేసింది. ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను బట్టి తొలి విడతగా 50శాతం నిధులు మంజూరయ్యాయి.

నిధుల మంజూరు ఇలా.

జిల్లాలో మొత్తం 1,060 ప్రభుత్వ పాఠశాలలుండగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను బట్టి పాఠశాలల నిర్వహణ నిధులు మంజూరు చేస్తోంది.

నిధుల కేటాయింపు

విద్యార్థుల సంఖ్య	నిధులు
1 నుంచి 30	రూ.10వేలు
31 నుంచి 100	రూ.25వేలు
101 నుంచి 250	రూ.50వేలు
251 నుంచి వేయి మందికిపైగా	రూ.1లక్ష

రెండు విడతల్లో నిధులు కేటాయిస్తారు. సుద్దముక్కలు, తరగతి గదులు శుభ్రం చేసే చీపుర్లు, రిజిస్టర్లు ఇతర ఖర్చుల కింద నిధులు వినియోగిస్తారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నిధులు కేటాయిస్తారు.

హెచ్ఎంలకు తప్పనున్న భారం.

బడిబాట, ఇతర కార్యక్రమాల నిర్వహణ, స్టేషనరి ఇతర బిల్లులకు ఖర్చు చేసేందుకు ప్రధానోపాధ్యులే డబ్బులు ఖర్చు చేశారు. పాఠశాలల నిర్వహణ నిధుల కోసం ఎదురుచూశారు. విద్యాసంవత్సరం ప్రారంభంలో పాఠశాలల్లో ఉన్న చిన్న మరమ్మతులు చేసేందుకు ప్రధానోపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. మరో వైపు ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులుగా ఉన్న చోట బడుల నిర్వహణకు డబ్బులు లేని కారణంగా వారు పలు కార్యక్రమాలు నిర్వహించలేదనే వాదనలు వినిపించాయి. ప్రభుత్వం స్కూల్ గ్రాంటు నిధులతో పాటు, స్పోర్ట్స్ గ్రాంటు నిధులు విడదల చేయడం క్రీడాకారులకు ఉపశమనం కలిగిస్తోంది. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు, 6వ తరగతి నుంచి 10వ తరగతికి సమగ్ర శిక్ష అభియాన్(ఎస్ఎస్ఏ) కింద ఇండోర్, అవుట్‌డోర్ గేమ్‌ల కోసం క్రీడా పరికరాలు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ప్రాథమిక పాఠశాలలకు రూ.5వేలు, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు రూ.10వేల చొప్పున నిధులు కేటాయించారు. ఈ విద్యాసంవత్సరానికి సంబంధించిన క్రీడా నిధులు మొదటి విడతలో 50శాతం మంజూరయ్యాయని అధికారులు వెల్లడించారు.

ఎస్ఎంసీ తీర్మానం మేరకు ఖర్చు

ప్రభుత్వం స్కూల్, స్పోర్ట్స్ గ్రాంట్ నిధులు విడుదల చేసింది.మార్గదర్శకాలకు అనుగుణంగా నిధులు వినియోగించుకోవాలి. వార్షిక గ్రాంట్‌లో 50శాతం నిధులే మంజూరయ్యాయి. ఎస్ఎంసీ తీర్మానం మేరకు నిధులు ఖర్చు చేయాలి.

– హరిశ్చందర్, మండల విద్యాధికారి, పరిగి

మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించండి

ప్రజాసంఘాల నాయకుల డిమాండ్



మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

అనంతగిరి: మణిపూర్‌లో జరుగుతున్న అల్లర్ల నేపథ్యంలో అక్కడ వెంటనే రాష్ట్రపతి పాలన విధించాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వికారాబాద్‌లోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం దేశ సంపదను అంబానీకి కట్టబెడుతూ అక్రమ సంపాదనకు మార్గం సుగమం చేస్తుందన్నారు. మణిపూర్ దుర్ఘటనలకు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహిస్తూ వెంటనే తప్పుకోవాలన్నారు. మహిళల పట్ల యావత్ దేశం తలదించుకునేలా ప్రవర్తించడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవి, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం, సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశం, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్, బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు పెద్ది అంజయ్య, రాజు, గిరిజన సంఘం నాయకులు శ్రీను నాయక్, రవి, అశోక్, రాములు, నర్సింలు, అశోక్, కుమార్, ఆనంద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల హామీలు నెరవేర్చాలి

టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: జర్నలిస్టులకు సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు తక్షణమే నెరవేర్చాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు సంఘం (టీయూడబ్ల్యూజే ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు కొంపల్లి శ్రీకాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆయన శుక్రవారం జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా స్టాఫ్ రిపోర్టర్లతో కలసి సీఎం కేసీఆర్‌కు పోస్టుకార్డుల ద్వారా విన్నవించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టులు పోషించిన భూమిక అత్యంత కీలకమైనదన్నారు. ఉద్యమ నేతగా జర్నలిస్టులను ఎన్నో సార్లు ప్రశంసించిన ఆయన సీఎంగా ఇచ్చిన హామీలు ఇప్పటివరకు నెరవేర్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల చిరకాల స్వప్నం అయినా ఇళ్ల స్థలాలు అర్హులైన జర్నలిస్టులకు తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అకస్మాత్తుగా అనారోగ్యాలకు గురవుతున్న జర్నలిస్టులు చికిత్స పొందే ఆర్థిక స్థోమత లేక అర్ధాంతరంగా మృత్యువాత పడుతున్నారని.. మరికొందరు వైద్యం కోసం అప్పుల పాలవుతున్నారన్నారు. తెలంగాణ ప్రభుత్వం జర్నలిస్టు ఆరోగ్య పథకం కింద అందించిన హెల్త్ కార్డులు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్థికంగా వెనుకబడి ఉన్న జర్నలిస్టులను గుర్తించి జర్నలిస్టు బంధు పథకం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని తమ సంఘం ఆధ్వర్యంలో దశలవారీ ఆందోళనలో భాగంగా వారం రోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా సీఎం కేసీఆర్ కు పదివేల పోస్టు కార్డులు పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు సామ జైపాల్‌రెడ్డి, ఎస్.శ్రీశైలం, గణేశ్, జంగయ్య, సురేశ్, శ్రీనివాస్ చారి తదితరులు పాల్గొన్నారు

బీఆర్ఎస్‌లో స్వచ్ఛంద చేరికలు



ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న బొంపల్లి వాసులు

పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

పరిగి: సంక్షేమ పథకాలకు ఆకర్శితులై స్వచ్ఛందంగా బీఆర్ఎస్‌లో చేరుతురన్నారని పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి అన్నారు. దోమ మండల పరిధిలోని బొంపల్లి గ్రామానికి చెందిన 20 మంది కాంగ్రెస్ కార్యకర్తలు శుక్రవారం ఎమ్మెల్యే సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని వర్గాల సంక్షేమానికి సీఎం కేసీఆర్ ప్రత్యేక పథకాలు ప్రవేశపెడుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం ఖాయమన్నారు. కాంగ్రెస్, బీజేపీలను రాష్ట్ర ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని చెప్పారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నాగిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్‌గౌడ్, ఎంపీటీసీ సభ్యుడు రాములు, ఉపసర్పంచ్ రఫిక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట.. దిగుబడికి దిట్ట

పచ్చిరొట్ట పంట దిగుబడిలో ప్రధానపాత్ర పోషిస్తుంది. భూసారం పెంపునకు ఎంతో మేలు చేస్తుంది. పంట పొలాల్లో రేగడికి బదులుగా నేల స్వభావాన్నిబట్టి పచ్చిరొట్ట ఎరువుతో భూమి సారవంతంగా మార్చుకోవచ్చునని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

- రైతుకు తగ్గనున్న పెట్టుబడి
- భూసారం పెంపునకు ఉపయోగం
- మండల వ్యవసాయాధికారి జయశంకర్





మొరంగపల్లిలో ఏపుగా పెరిగిన జనుము

మోమిన్‌పేట: పచ్చిరొట్ట ఎరువులు భూసారాన్ని పెంచి అధిక దిగుబడులు ఇచ్చేందుకు దోహద పడుతుందని మండల వ్యవసాయాధికారి జయశంకర్ తెలుపుతున్నారు. పంటలకు రసాయనిక ఎరువులు తగ్గించడం, తెగుళ్లు, వైరస్‌లు సోకకపోవడంతో రైతుకు పెట్టుబడి ఖర్చు తగ్గుతుందని పేర్కొన్నారు. సాధారణ పంటల సాగుతో పోల్చితే పచ్చి రొట్ట ఎరువుతో సాగు చేసిన పంటలు అధిక దిగుబడిలిస్తాయని వివరించారు. రసాయనిక ఎరువల వాడకంతో భూసారం తగ్గి దిగుబడులు తగ్గుతున్నాయని ఆయన చెప్పారు.

పచ్చిరొట్ట రకాలు

పచ్చిరొట్ట ఎరువులను ఇచ్చే పంటలు నాలుగు రకాలుగా ఉన్నాయి. జనుము, జీలుగ, పిల్లి పెసర, బయాంచ.

ఎకరాకు 10టన్నుల సేంద్రియ ఎరువు

పచ్చిరొట్ట ఎరువులనిచ్చే పంటలను జూన్ మొదటి వారంలో విత్తుకోవాలి. ఎకరాకు జీలుగ 15 నుంచి 20 కిలోలు, జనుము 20 నుంచి 25 కిలోలను విత్తుకోవాలి. పిల్లిపెసర, బయాంచ విత్తనాలు ప్రస్తుతం అందుబాటులో లేవు. విత్తిన 40 రోజుల తర్వాత వాటిని భూమిలో కలియదున్నుకోవాలి. పూత దశకు రావడం, కింది వేర్లకు బుడిపెలు వచ్చే సమయంలో దున్నుకోవడంతతో మేలు చేకూరుతుంది. కింద వేర్లకు బుడిపెలు రావడంతో నత్రజని భూమిలోనే నిలువ ఉంటుంది. ఎకరాకు 10నుంచి 12టన్నుల సేంద్రియ ఎరువు అందుబాటులోకి వస్తుంది. భూమిలో రెండు సార్లు కలియ దున్ని పూర్తిగా భూమిలో మాగిన తర్వాత రెండవ పంట సాగు చేసుకోవాలి. ఆధునిక సాంకేతిక పరికరాలైన ట్రాక్టరు, రోటవేటర్‌తోనూ కలియ దున్నుకోవచ్చు. ప్రభుత్వం జనుము, జీలుగలు సబ్సిడీపై అందిస్తోందని వ్యవసాయాధికారి చెప్పారు.

నివారణకు జాగ్రత్తలు తప్పనిసరి

కత్తెర పురుగుపై రైతులకు ఏఓ సూచన



సోయాబీన్ పంటను పరిశీలిస్తున్న ఏఓ వసంత

మర్పల్లి: మొక్కజొన్న పంటకు కత్తెర పురుగు సోకకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి నివారణ చర్యలు తీసుకోవాలని మర్పల్లి ఏఓ వసంత రైతులకు సూచించారు. మండలంలో సాగు చేస్తున్న మొక్కజొన్న పత్తి, సోయాబీన్ పంటలను శుక్రవారం ఆమె పరిశీలించారు. వాతావరణ మార్పులతో పాటు పొలాల్లో పోషకాలు లోపించడం వల్ల మొక్కజొన్న పంటపై కత్తెర పురుగు బెడద అధికంగా ఉంటుందని చెప్పారు. 10 రోజుల నుంచి 25 రోజుల పంట సమయంలో పురుగు ఉధృతిని బట్టి ఎకరాకు లీటర్ వేప నూనెను పంటపై పిచికారి చేయాలని సూచించారు. కలుపు మొక్కలు ఉండకుండా చూసుకోవాలన్నారు. వర్షాలు కురిసినప్పుడు పంట ఎదుగుదలకు అవసరం మేరకు సేంద్రియ ఎరువులు వేసుకోవాలని చెప్పారు. పత్తి, సోయాబీన్, మినుము వంటి పంటల్లోనూ నీరు నిలువ కుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

బస్సు, బైక్ ఢీ..

ద్విచక్ర వాహనదారుడికి గాయాలు

కేశంపేట: ఆర్టీసీ బస్సు బైక్ ఢీకొట్టిన ప్రమాదంలో ఒకరు గాయపడ్డారు. ఈ ఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన పెబ్బె నర్సింహ తన కుమారుడు తరుణ్‌తో కలిసి పని నిమిత్తం కేశంపేటకు వచ్చారు. గ్రామంలోని పెట్రోల్ బంక్‌లో ఇంధనం పోయించుకుని వెళ్తున్న క్రమంలో ఆర్టీసీ బస్సును ఢీ కొట్టాడు. ఈ ఘటనలో నర్సింహకు గాయలవ్వగా తరుణ్ బైక్‌పై నుంచి దూరంగా పడిపోయాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలికి చేరుకున్న కుటుంబ సభ్యులు క్షతగాత్రుడిని షాద్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఏబీవైఎం జిల్లా ఉపాధ్యక్షుడి నియామకం

మొయినాబాద్: అఖిల భారత యాదవ మహాసభ(ఏబీవైఎం) రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడిగా రవీందర్ యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఆయనకు అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్ యాదవ్, రాష్ట్ర యువజన అధ్యక్షుడు రమేష్ యాదవ్ నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాదవుల ఐక్యత, అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అనంతరం రవీందర్ యాదవ్ మాట్లాడుతూ జిల్లాలో యాదవ మహాసభ విస్తరణకు కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సమసర్థవంతంగా నిర్వహిస్తానని చెప్పారు. కార్యక్రమంలో యాదవ మహాసభ రాష్ట్ర నాయకుడు సుధాకర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కాన్పుల సంఖ్య పెంచాలి

- డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జయలక్ష్మి
- ప్రభుత్వాస్పత్రిలో ఆరోగ్య సిబ్బందికి సమీక్ష సమావేశం



మాట్లాడుతున్న డాక్టర్ జయలక్ష్మి

షాద్‌నగర్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పుల సంఖ్య పెంచేలా ఆరోగ్య సిబ్బంది కృషి చేయాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జయలక్ష్మి సూచించారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో డివిజన్ పరిధిలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సూపర్ వైజర్లు, డీఈఓ, ఏఎస్ఎంలతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జయలక్ష్మి మాట్లాడుతూ.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఎంలు గర్భిణులకు గుర్తించి వివరాలు సేకరించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసూతి చేయించుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వారికి వివరించాలని సూచించారు. వారికి క్రమం తప్పకుండా టీటీ వ్యాక్సినేషన్, ఐరన్, ఫోలిక్ మాత్రలను పంపిణీ చేయాలన్నారు. గర్భిణులకు ఎనిమియా వ్యాధి భారిన పడకుండా చూడాల్సిన బాధ్యత ఏఎస్ఎంలదే అన్నారు. ప్రతీ బుధ, శనివారం వ్యాక్సినేషన్ ప్రక్రియలో భాగంగా ఏడాది వయస్సులోపు ఉన్న చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. మధుమేహం, బీపీ వ్యాధిగ్రస్తులకు మందులను పంపిణీ చేయాలని చెప్పారు. వర్షాలు కురుస్తున్నందున వ్యాధుల బారిన పడకుండా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. విధి నిర్వాహణ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, డివిజన్ వైద్యాధికారులు,హెల్త్ సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

నావంద్గీ సొసైటీకి భారీ రుణం

- రూ.2.50 కోట్లు మంజూరు చేసిన డీసీసీబీ బ్యాంకు
- ఆగస్టు నుంచి సొసైటీ సభ్యులకు కొత్త రుణాలు



నావంద్గీ సొసైటీ కార్యాలయం

బషీరాబాద్: నావంద్గీ రైతు సహకార సంఘానికి రంగారెడ్డి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) రూ.2.50 కోట్ల భారీ రుణం మంజూరు చేసింది. ఈ మేరకు డీసీసీబీ బ్యాంకు శుక్రవారం రుణమంజూరుపై ఉత్తర్వులు జారీచేసింది. నావంద్గీ (బషీరాబాద్) సొసైటీ కింద 4,558 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. వీరిలో 1,458 మంది రైతులకు సొసైటీ అధికారులు గతేడాది పంట రుణాలు మంజూరు చేశారు. దీర్ఘకాలిక రుణాలు పొందిన రైతులు కేవలం 150 మంది మాత్రమే ఉన్నారు. ప్రస్తుతం డీసీసీబీ ఇచ్చిన కొత్త రుణంతో ఎక్కువ మంది రైతులకు దీర్ఘకాలిక, పంట రుణాలు అందే అవకాశాలు ఉన్నాయి. అయితే ఈసారి రైతులకు కమర్షియల్ కింద ఎల్‌టీ లోన్‌లు ఇవ్వాలని పాలకవర్గం గతంలోనే నిర్ణయించింది. ఇందులో హార్‌వెస్టర్ యంత్రాలు, ట్రాక్టర్లు, జేసీబీలకు ప్రాధాన్యత ఇవ్వాలని సొసైటీ నిర్ణయించింది. గతంలో ఎడ్లబండ్లు, గొర్రెలు, బర్రెలకు రుణాలు ఇస్తే రైతులు సక్రమంగా చెల్లించడంలేదని.. వాటిస్థానంలో యంత్రాలు ఇచ్చే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. సొసైటీ పరిధిలో ఉన్న రైతాంగానికి ఆగస్టు నుంచి కొత్త రుణాలు ఇవ్వడానికి పాలకవర్గం, అధికారులు సిద్ధమయ్యారు. అయితే గతంలో దీర్ఘకాలిక రుణాలు తీసుకున్న వాళ్లకు కాకుండా కొత్తవారికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తామని సంఘం అధికారి ఒకరు తెలిపారు. భూ విస్తీర్ణాన్ని బట్టి రైతులకు రుణాలు మంజూరు చేయనున్నారు.

కొత్తవారికి అవకాశం కల్పిస్తాం

డీసీసీబీ ద్వారా సొసైటీకి దీర్ఘకాలిక, స్వల్పకాలిక పంటరుణాల కోసం రూ.2.50కోట్ల రుణం వచ్చింది. త్వరలో మరో రూ.2కోట్ల వరకు రుణం అందే అవకాశం ఉంది. గతంలో రుణాలు పొందని రైతులకు ఎక్కువమందికి ఇందులో అవకాశం కల్పిస్తాం. భారీ రుణం మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి, డీసీసీబీ చైర్మన్ మనోహర్ రెడ్డికి సొసైటీ పాలకవర్గం, రైతుల తరుపున కృతజ్ఞతలు తెలుపుతున్నాం.

– వెంకట్‌రామ్‌రెడ్డి, సొసైటీ చైర్మన్

షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం



కాలిపోయిన వస్తువులు చూపుతున్న బాధితుడు

హుడాకాంప్లెక్స్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో ఉన్న వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ సంఘటన సరూర్‌నగర్ డివిజన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం.. భగత్‌సింగ్‌నగర్ ఫేజ్–2కు చెందిన మహ్మద్ పాషా సోఫా రిపేర్‌లు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఇటీవల ఇంటి పై నూనతంగా మరో అంతస్తును నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. దీంతో ఇంట్లో వస్తువులన్నీ ఒక గదిలో ఉంచి మరో ఇంట్లో నిద్రిస్తున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్ రావడంతో ఇంట్లో వస్తువులన్నీ కాలిపోయాయి. సుమారు రూ.3లక్షల వరకు ఆస్తినష్టం జరిగిందని బాధితుడు తెలిపాడు. సమాచారం అందుకున్న మాజీ కార్పొరేటర్ పారుపల్లి అనితా దయాకర్‌రెడ్డి ఇంటిని సందర్శించి పాషాను పరామర్శించి తన వంతుగా ఆర్థిక సహాయం అందజేశారు. మంత్రి సబితారెడ్డి దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని ఆమె హామీ ఇచ్చారు.